
సురేష్‌ను సత్కరిస్తున్న ఏదెల్లి అజయ్‌కుమార్, రవీందర్‌గౌడ్ తదితరులు

బీజేపీ గంగానగర్ పోలింగ్‌బూత్ కమిటీ ఎన్నిక

గోల్నాక, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా గోల్నాక డివిజన్ గంగానగర్ (పోలింగ్‌బూత్ నెం.169) పోలింగ్ బూత్ కమిటీ నూతన కార్యవర్గాన్ని శనివారం నియమించారు. పార్టీ డివిజన్ సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జి ఏదెల్లి అజయ్‌కుమార్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్‌లు హాజరై కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బూత్ కమిటీ అధ్యక్షుడుతగా పి.సురేష్, కార్యదర్శిగా పి.సాయికుమార్, లాభార్థి ప్రముఖ్‌గా పి.వినయ్, మన్‌కీబాత్ ప్రముఖ్‌గా ఎస్.శ్రీనివాస్, వాట్సాప్‌గ్రూప్ ప్రముఖ్‌గా కె.సాయితేజ, బీఎల్‌ఏ టుగా పి.సురేష్, కమిటీ సభ్యులుగా జి.శ్రవణ్‌కుమార్, పి.యశ్వంత్‌కుమార్, బి.రవి, కె.వెంకటేష్, సీహెచ్ అశోక్, లల్లా ప్రధాన్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు అజయ్‌కుమార్, రవీందర్‌గౌడ్‌లు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కె.రాంచందర్, మహ్మద్ సలీమ్, సింగీతం రాజేష్, తదితరులు పాల్గొన్నారు.


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన రజక ఫెడరేషన్ చైర్మన్ ఎం.నర్సింహ

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి: రజక ఫెడరేషన్

బర్కత్‌పుర, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక ఫెడరేషన్ చైర్మన్ ఎం.నర్సింహ విజ్ఞప్తి చేశారు. శనివారం బర్కత్‌పురలోని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని తన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని 21 రాష్ట్రాల్లో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని, రెండు తెలుగు రాష్ట్రాలలో మాత్రమ బీసీ జాబితాలో ఉన్నారన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. నగరంలో ధోబీఘాట్‌లలో కమ్యూనిటీహాల్స్, బోర్‌వెల్స్, వాషింగ్ మిషన్స్, టాయిలెట్స్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కె.హరినాథ్, కె.నర్సింగ్‌రావు, ఎస్.రాజు, జి.గణేశ్, ఎ.రమేష్‌బాబు, బి.చంద్రమోహన్, పి.కిషన్, శ్రీధర్, జ్యోతి, సునంద, రాజు, సంజయ్; అశోక్‌కుమార్, కె.రాము తదితరులు పాల్గొన్నారు.


జిల్లా స్థాయి నెట్‌బాల్ విజేతలతో కాచిగూడ ప్రిన్సిపాల్ చిరంజీవి

రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీల్లో పతకాలు సాధించాలి

బర్కత్‌పుర, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలలో పతకాలు సాధించాలని కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిరంజీవి అన్నారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సీఎం కప్ క్రీడల్లో భాగంగా జిల్లా స్థాయి నెట్‌బాల్ పోటీల ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు పతకాలను అందజేశారు. రాష్ట్ర జూనియర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.లక్ష్మయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ప్రసాదరావు, నెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి విఘ్నేష్, పిఈటీ లక్ష్మణ్‌నాయక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ జట్టు డబుల్ టైటిక్ చేజిక్కించుకుంది.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.రవికుమార్‌యాదవ్ తదితరులు

ఆర్.కృష్ణయ్యకు పద్మశ్రీ అవార్డు ఇవ్వాలి

రాంనగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీసీల సమస్యల పట్ల నాలుగు దశాబ్దాలుగా పోరాడుతున్న రాజ్యసభసభ్యులు ఆర్.కృష్ణయ్యకు పద్మశ్రీ అవార్డు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.రవికుమార్‌యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన విద్యార్థి రాజకీయాల నుంచి బీసీల డిమాండ్లు సమస్యలపై పోరాటం చేయడం వల్లనే నేడు అనేక పథకాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేశాయని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు, బడ్జెట్‌లో వాటా కేటాయించడం జరిగిందన్నారు. ఆర్.కృష్ణయ్య నాలుగు దశాబ్దాలుగా ధర్నాలు, నిరసన పోరాట కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. ఆర్.కృష్ణయ్యకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడంపై కేంద్రం ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో సాయికుమార్. ప్రసాద్; సాయితేజ, నరేష్, చంద్రశేఖర్, ఆదర్శ్ పాల్గొన్నారు.

వీధిదీపాలు ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డివిజన్ వ్యాప్తంగా వెలగని వీధి దీపాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొత్త విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. శనివారం జవహర్‌నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్‌తో కలిసి ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్ట్రీట్‌లైట్ల సమస్యలపై పలుమార్లు జోనల్ కమిషనర్, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు మరమ్మతులు చేయడం లేదని ఆరోపించారు. వీధి దీపాలు లేని చోట్ల చేయాలని లేనిపక్షంలో డివిజన్ ప్రజలతో కలిసి సంబంధిత అధికారుల కార్యాలయం ముందు పెద్దఎత్తున ధర్నా చేపడుతామని హెచ్చరించారు.


మేడిబావి బస్తీలో అయ్యప్ప మహాపడిపూజలో ముఠా జైసింహ

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

ముషీరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాంనగర్‌లోని మేడిబావి బస్తీలో ప్రభాకర్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పమహాపడిపూజ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్పస్వాములకు బిక్షను ప్రాంభించారు. విజయ్ గురుస్వామిచే నిర్వహించిన అయ్యప్పస్వామి భక్తిగీతాల భజన కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ఎస్ శంకర్, అయ్యప్పస్వాములు శ్రీధర్‌రెడ్డి, ప్రవీణ్, రాము, కృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ-1 పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా ఉండదని సీబీడీఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. రెడ్‌రోజ్, వివేక్‌నగర్, మీరా థియేటర్, లక్డీకాపూల్, హైదర్‌గూడ, తాజ్‌మహల్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1, ఐసీ క్వార్టర్స్ సిటీసెంట్రల్ లైబ్రరీ, నాంపల్లి రైల్వేస్టేషన్, సత్యం కంప్యూటర్స్ కలెక్టర్ ఆఫీస్, శాంతాబాయి, పరిశ్రమ్ భవన్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

క్రిస్మస్‌కు బేతెల్ చర్చి ముస్తాబు


ముస్తాబైన బేతెల్ గాస్పెల్ చర్చి

గోల్నాక, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు గోల్నాక డివిజన్‌లోని అన్నపూర్ణనగర్‌లో గల బేతెల్ గాస్పెల్‌చర్చి సర్వాంగసుందరంగా ముస్తాబైయింది. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని చర్చి విద్యుత్ లైట్లతో అలంకరించారు. అన్నపూర్ణనగర్‌లో 1985 జూలై 7న పాస్టర్ రెవరెండ్ కె.సుధాకర్ బేతెల్ గాస్పెల్ చర్చిని ప్రారంభించారు. ఈ చర్చి 39 ఏళ్లుగా ఒకవైపు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో బాసిల్లుతోంది. సామాజిక సేవాకార్యక్రమాలతో దూసుకెళుతోంది. హెచ్ఐవీ రోగులకు కౌన్సిలింగ్ ఇస్తూ.. వారిలో మనోధైర్యం కలిగిస్తున్నారు. అంతేకాదు వారికి నెల నెలా నిత్యావసరాల సరుకులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అనాథ బాలలకు వసతి కలిపిస్తూ విద్య నేర్పిస్తూ వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నారు. ప్రజలకు ఉచితంగా మినరల్ వాటర్ అందిస్తూ.. నెలనెలా వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఒకవైపు ఆధ్యాత్మితతో మరోవైపు సామాజిక సేవాకార్యక్రమాలతో ఈచర్చి ఒక ప్రత్యేకత ఆదరణ పొందింది. ఈ చర్చి ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలివడమేకాక హెచ్ఐవీ రోగులకు కౌన్సిలింగ్, నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీచేస్తూ, అనాథ బాలలకు వసతి సౌకర్యం, విద్యాబుద్ధులు చెప్పిస్తూ సామాజిక సేవాలో పాల్గొంటుంది. ఈ చర్చిలో ప్రతీనెల మొదటి గురువారం సుమారు 400 మంది హెచ్ఐవీ రోగులకు కౌన్సిలింగ్ ఇస్తూ వారిలో మనోధైర్యాన్ని కల్పిస్తున్నారు. వారికి నెలకు సరిపోను నిత్యావసర వస్తువులను కూడా ఉచితంగా అందజేస్తున్నారు. సుమారు అనాథ బాలలకు చర్చిలో ఉచితంగావసతి సౌకర్యం కల్పించడంతో పాటు వారికి పాఠశాలలకు పంపి విద్యాబుద్ధులు చెప్పిస్తున్నారు. చర్చిలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి అన్నపూర్ణనగర్ బస్తీవాసులకు ఉచితంగా స్వచ్ఛమైన తాగు నీటిని అందిస్తున్నారు. స్థానిక బస్తీవాసులకు ప్రతీనెల ఉచితవైద్య శిబిరం నిర్వహించి వైద్యసేవలందిస్తున్నారు. క్రిస్మస్ వేడుకలను ఈనెల 25న అంబర్‌పేట సీపీఎల్ రోడ్డులోని ఏకే ఫంక్షన్‌ప్లాజాలో పెద్దఎత్తున నిర్వహిస్తారు.

కాంట్రాక్ట్, మునిసిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నేతల డిమాండ్


మహాధర్నాలో మాట్లాడుతున్న ఉప్పలయ్య

కవాడిగూడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే తదితర పద్ధతుల్లో పని చేస్తున్న మునిసిపల్ సిబ్బంది పర్మినెంట్ చేయాలని, 2వ పీఆర్‌సీ కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో మునిసిపల్ కార్మికుల మహాధర్నా నిర్వహించారు. ఈ మహాధర్నాకు వివిధ జిల్లాల నుంచి కార్మికులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ మహాధర్నాలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాలడుగు భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, రాష్ట్ర కార్యదర్శి పి సుధాకర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రా నరసింహులు, రాష్ట్ర మహిళా కన్వీనర్ వి నాగమణి, రాష్ట్ర కార్యదర్శి ఎం శ్రావణ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం అశోక్, ఉప్పలయ్య, వెంకటస్వామిలు హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్ ఫిక్స్‌డ్ పే కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కార్మికుల, ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.


బహుమతి గ్రహీతలతో అతిథులు

సాహిత్య ప్రక్రియల్లో పోటీలు ఉత్తమ రచనలకు దోహదపడతాయి

చిక్కడపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వివిధ సాహిత్య ప్రక్రియల్లో పోటీలు రచనలు వెలుగుచూస్తాయని రచయిత, సినీ విజ్ఞాన విశారద ఎస్వీ రామారావు అన్నారు. ముట్నూరి కమలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం త్యాగరాయగానసభలో సాహితీకిరణం పత్రిక సౌజన్యంతో నిర్వహించిన చిన్న కథల పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా రామారావు పాల్గొని బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. తెలుగులో కవితా ప్రక్రియలో వచ్చినంతగా కథ, విమర్శ, వ్యాసప్రక్రియలలో రచనలు వెలువడకపోవడం లోటు అన్నారు. అధ్యక్షత వహించిన నేటినిజం సంపాదకులు బైస దేవదాసు మాట్లాడుతూ పెద్ద కథలకు సమయం కేటాయించడం పరుగుల జీవితంలో కష్టం అవుతుందన్నారు. లఘుకథలు క్లుప్తతే ప్రధానంగా కథావస్తువుపై ఆసక్తి పెంచుతాయన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

బీసీ కార్పొరేషన్ ద్వారా

సబ్సిడీ రుణాలు ఇవ్వాలి: ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయలు రుణం 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని రాజ్యసభసభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న 12 కుల ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలని, 30 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడలోని అబినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్లుట్ల శ్రీనివాస్ అధ్యక్షతన బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ కులాల కార్పొరేషన్లకు చైర్మన్, పాలకమండలిని ఏర్పాటు చేయాలన్నారు. గతంలో రద్దు చేసిన జిల్లా బీసీ కార్పొరేషన్ల ఈడీ పోస్టులను వెంటనే పునరుద్దరించాలన్నారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు 2 వేల కోట్ల రూపాయలను కేటాయించాలని, ఉన్నత చదవులు చదివే బీసీ విద్యార్థుల ఫీజు స్కీమ్‌ను వెంటనే పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. విదేశీ విద్య స్టైఫండ్ ఫీజుకు 300 కోట్ల రూపాయలను కేటాయించాలని, బీసీ స్టడీ సర్కిల్స్‌కు 200 కోట్లను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, జిల్లపల్లి అంజి, నంద గోపాల్; ఉదయ్‌నేత, రాందేవ్ మోదీ, పగిల్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'మానవాళికి మహోదయం' పుస్తకావిష్కరణ

కవాడిగూడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ 37వ జాతీయ బుక్‌ఫెయిర్‌లో తోపుడు బండి సాదిక్ వేదికపై శనివారం రాత్రి ప్రముఖ ఆర్థికవేత్త డి.పాపారావు రచించిన మానవాళికి మహోదయం (అంతం కాదిది ఆరంభం) అనే పుస్తకాన్ని శాసనమండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ పరిమాణాల్ని పెట్టుబడి దారిలో అంతర్ వైరుద్యాలను చెప్పేదే ఈ పుస్తకం అన్నారు. పెట్టుబడి దారి వ్యవస్థను ప్రపంచదేశాల మీద చాలా బలంగా రుద్దింది అనే అంశాలను సుదీర్ఘంగా చర్చించిందే ఈ పుస్తకం అన్నారు. పెట్టుబడి దారి విధానం వైరుద్యాల వలన అంతం కావడం ఖాయం, భవిష్యత్ సోషిలిజం అని పుస్తక పరిచయాన్ని సీనియర్ జర్నలిస్టు వీక్షణం ఎన్ వేణు గోపాల్ అన్నారు. రచయిత డాక్టర్ జతిన్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరిలు హాజరై ఆవిష్కరించారు.

వెలుగువైపుగా పుస్తకావిష్కరణ

రచయిత ధూపాటి ప్రభాకర్ రచించిన వెలుగు వైపుగా పుస్తకావిష్కరణ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో జరిగింది, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు కవి యాకుబ్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆంగ్లంలో రాసిన ఈ పుస్తకాన్ని పలువురు రచయితలు తెలుగులోకి అనువదించారు. కవి యాకుబ్ మాట్లాడుతూ వెలుగు వైపుగా పుస్తకాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందని అన్నారు. పంతుల గోపాల కృష్ణ పుస్తకాన్ని పరిచయం చేస్తూ ఇందులో 63 కథలున్నాయని అన్నారు. ధూపాటి ప్రభాకర్ అద్భుతమైన కథకుడు అని అన్నారు. ఈ కార్యక్రంలో గంటి జానకి, సుగుణ, తాళ్లూరి సావిత్రి రమణారావు, పద్మిని పాల్గొన్నారు.

భాషా సంస్కృతుల పరిరక్షకుడు 'వరప్రసాద్‌రెడ్డి'

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రాణాధారమైన టీకాలను మానవాళికి అందించడమే కాకుండా, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణను ఒక మహోద్యమంలా నిర్వహిస్తున్న మానవతావాది శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకుడు వరప్రసాద్‌రెడ్డి అని ఆచార్య ఎల్లూరి శివారెడ్డి కొనియాడారు. ఆయన ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందిస్తూ, సమాజంపై తన బాధ్యతను నిర్వర్తిస్తున్న సౌజన్యశీలి అని శ్లాఘించారు. శాంతా వసంతా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు సభామందిరంలో మనసు ఫౌండేషన్ నిర్వాహకుడు మన్నం వెంకటరాయుడుకు 'వేంకటరమణారెడ్డి సాహితీ సేవారత్న' పురస్కారాన్ని, ప్రఖ్యాత సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు 'డా.వరప్రసాద్‌రెడ్డి ఉత్తమ సాహితీవేత్త' అవార్డును తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారుడు కేవీ రమణాచారి చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఒక్కొక్కరికి లక్ష రూపాయల నగదు పురస్కారాన్ని అందజేశారు. అనంతరం రమణాచారి మాట్లాడుతూ తల్లిదండ్రులు శాంత, వేంకట రమణారెడ్డి స్మారకంగా సాహితీమూర్తులు, కళాకారులను ప్రోత్సహిస్తూ అవార్డులు ఇవ్వడం గొప్పవిషయం అని ప్రశంసించారు. భాషా సంస్కృతుల పట్ల అపారమైన గౌరవంతోనే సమాజానికి తమ వంతు బాధ్యతగా సేవలందిస్తోన్న కవులు, కళాకారులను గుర్తించి, ఆ సేవామూర్తులను ప్రతి ఏటా సత్కరిస్తున్నామని శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకుడు పద్మభూషణ్ అవార్డు గ్రహీత వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. మనసు ఫౌండేషన్ ద్వారా మన్నం వెంకటరాయుడు చేస్తున్న సాహిత్య కృషి అనితరసాధ్యమైనది అంటూ కొనియాడారు. సుద్దాల అశోక్‌తేజ పాటలకు తాను అభిమాని అని వరప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధానకార్యదర్శి జె.చెన్నయ్య, శాంతా వసంతా ట్రస్ట్ కార్యదర్శి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల గొంతుకగా మారిన వ్యక్తి వీటీ రాజశేఖర్: ప్రొ.కంచె ఐలయ్య

రాంనగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దళితుల పక్షాన చరిత్రలో మొట్టమొదటి సారి ఆధిపత్య కులానికి చెందిన వీటీ రాజశేఖర్ దళితుల గొంతుకగా మారాడని ప్రొఫెసర్ కంచె ఐలయ్య అన్నారు. దళిత్ వాయిస్ ఎడిటర్, అంబేడ్కరైట్ కార్యకర్త, వీటీ రాజశేఖర్ సంస్మరణ సభ సమాంతర సంస్థ ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సభలో తొలితరం దళిత నేత బత్తుల శ్యామ్‌సుందర్ పుస్తకాన్ని విడుదల చేశారు. అనంతరం ప్రొఫెసర్ కంచె ఐలయ్య మాట్లాడుతూ మహారాష్ట్రలో జరిగిన దళిత్ పాంథర్స్ ఉద్యమాన్ని దేశమంతా ప్రచారం చేశాడని అన్నారు. దళిత్ అనే పదానికి అర్థం చెప్పిన మహామేధావి అన్నారు. దళిత్ వాయిస్ పత్రిక ద్వారా ఎన్నో రచనలు చేశారని, దళితులు, ముస్లింల ఐక్యత కోసం కృషి చేశారని ఆయన కొనియాడారు. ఈ సంస్మరణ సభలో వి.టి.రాజశేఖర్ కుమారుడు సలిమ్‌శెట్టి, దర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారాదన్, మసూద్ ప్రకాష్, మూల భారతి, డాక్టర్ ఆలీంఖాన్, సమాంతర ఎడిటర్ వరుణ్‌కుమార్, గద్దర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జి.వి.సూర్యకిరణ్, సీనియర్ దళిత నేతలు కొరివి వినయ్‌కుమార్, జె.గౌతమ్, పి.శంకర్, నల్లబాబు, క్రాంతికారణ్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రొఫెసర్ కంచె ఐలయ్య తదితరులు


రెగ్యులరైజ్ చేయాలని రాస్తారోకో చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

రాంనగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను ప్రభుత్వం గుర్తించి రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో రాస్తారోకో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడుతూ.. 20 సంవత్సరాలుగా వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు పని చేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వీరి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో తమ పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.కవిత, కిరణ్, లక్ష్మీబాయి, రమ, బాలమణి, అమ్మాజీ, మంగ, షీల, సులోచనమ్మ పాల్గొన్నారు.

తెలంగాణ తమిళుల సమావేశం నేడు

చిక్కడపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో నివసిస్తున్న తమిళుల సమావేశం ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం మధ్యాహ్నం కార్మిక మిషనరేట్ అడ్వొకేట్ చాంబర్‌లో తెలంగాణ తమిళ సంఘం అధ్యక్షుడు ఎంకే బోస్ మాట్లాడారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి రాత్రి వరకు సమావేశం జరుగుతుందని తెలిపారు. తమిళ సంప్రదాయ శాస్త్రీయ, జానపద కళా బృందాల ప్రదర్శనలు, ప్రత్యేక సంచిక ఆవిష్కరణ, ప్రతిభా అవార్డుల ప్రదానం, సభ్యులకు నూతన సంవత్సర తమిళ క్యాలెండర్ పంపిణీ కార్యక్రమాలుంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణలో నివసిస్తున్న తమిళ ప్రజలు హాజరుకావాలని కోరారు.

మెట్రోలో మహిళల భద్రతకు ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

వరకు మహిళా కెప్టెన్ల ద్వారా ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీని అందిస్తే ఆ వర్గానికి చెందిన ప్రయాణికులకు మరింత ధైర్యం, అనుకూలత ఉంటుందన్నారు. నగరంలో మెట్రో రెండోదశ విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని, ఓల్డ్‌సిటీలో త్వరలో కూల్చివేత పనులను ప్రారంభిస్తామన్నారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 1100 ఆస్తులు మెట్రో నిర్మాణంలో పోతున్నాయని, ఆస్తులు కోల్పోతున్నవారికి గజానికి రూ.81 వేల పరిహారం అందిస్తున్నామని పేర్కొన్నారు.

గ్రీన్ ట్యాక్సీలు తీసుకొస్తాం: వరదరాజన్

రానున్న రోజుల్లో నగరంలో ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ కింద మెట్రో స్టేషన్ల నుంచి రోజుకు 2 లక్షల మందికి సేవలందిస్తామని ఎల్అండ్‌టీ చీఫ్ స్ట్రాటజిక్ ఆఫీసర్ మురళీవరదరాజన్ అన్నారు. ప్రధానంగా గ్రీన్ ట్యాక్సీలను అందుబాటులోకి తీసుకొచ్చి కాలుష్యాన్ని అరికట్టేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఎల్అండ్‌టీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రిషివర్మ మాట్లాడుతూ 2021లో ర్యాపిడో సంస్థతో తాము ఒప్పందం చేసుకున్నామని, ప్రస్తుతం రోజుకు 45 వేల మంది ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీని సేవలు పొందుతున్నారని, రానున్న రోజుల్లో 75 వేల మంది వినియోగించుకునేలా కృషి చేస్తామన్నారు. ర్యాపిడో కో ఫౌండర్ పవన్ మాట్లాడుతూ.. నగరంలో బైక్‌లు, ఆటోలు, కార్ల ద్వారా తాము ప్రతీరోజు 2.7 లక్షల మందికి సేవలందిస్తున్నట్లు చెప్పారు. మెట్రో స్టేషన్ల నుంచి 0-3 కిలోమీటర్ల వరకు 30, 3-4 కిలోమీటర్లకు రూ.40, 4-5 కిలోమీటర్లకు రూ.50 చొప్పున చార్జీలను తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎల్అండ్‌టీ అధికారులు, ర్యాపిడో సిబ్బంది పాల్గొన్నారు.

గణితశాస్త్రమేధావి శ్రీనివాస్ రామానుజన్


నివాళులర్పిస్తున్న త్రినాథరావు, జనార్దనమూర్తి

చిక్కడపల్లి డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గణిత శాస్త్రంలో అపార మేధాసంపన్నుడు శ్రీనివాస రామానుజన్ అని ప్రముఖులు పేర్కొన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా శ్రీనివాస రామానుజన్ యాదిలో పేరిట సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. కీలక ప్రసంగం చేసిన ఎస్‌బీఐ మాజీ ఏజీఎం చింతలపూడి త్రినాథరావు మాట్లాడుతూ భారతీయ గణితశాస్త్రంలోని లోతులను అధ్యయనం చేసి ప్రపంచానికి చాటిన శ్రీనివాసరామానుజన్ ప్రతిపాదించిన సూత్రాలు గణిత శాస్త్రవేత్తలకు ఉపయుక్తం అని వివరించారు. గాయకుడు శ్రీధరం రామసుబ్రహ్మణ్యం, గాయని అమంత, శంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తుల నియామకంలో అందరికీ ప్రాధాన్యం ఇవ్వాలి

సుప్రీంకోర్టు న్యాయవాది పీవీ సురేంద్రనాథ్



మాట్లాడుతున్న సుప్రీంకోర్టు న్యాయవాది పీవీ సురేంద్రనాథ్

రాంనగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశంలోని వివిధ న్యాయస్థానాలలో న్యాయమూర్తుల నియామకం విషయంలో రాజకీయ జోక్యం లేకుండా అన్నివర్గాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సుప్రీంకోర్టు న్యాయవాది పీవీ సురేంద్రనాథ్ పేర్కొన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆలిండియా లాయర్స్ తెలంగాణ రాష్ట్ర కమిటీ, లా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండి యా ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. భారత రాజ్యాంగం మౌలిక సూత్రాలైన లౌకికభావన, ప్రజాస్వామ్య విలువలను రక్షించాల్సిన బాధ్యత విద్యార్థులు, న్యాయవాదుల ఉందన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ జి.మోహన్‌గోపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో అనధికార అత్యవసర పరిస్థితి నడుస్తోందని, ఆనాటి ఇందిరాగాంధీ విధించిన అత్యవసర పరిస్థితి కంటే ప్రమాదకరంగా మారే అవకాశం ఉందన్నారు. మానవ సమాజమంతా ఒక్కటేనన్న వసుదైక కుటుంబ భావనను పెంపొందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.శ్రీనివాస్‌రావు కె.పార్థసారధి, సి.రాంచంద్రారెడ్డి, ప్రవీణ్, వనజ, వెంకటేశ్వర్లు, మాధవరెడ్డి, ఎం.వెంకటరెడ్డి, వెంకటేష్, కుమార్, న్యాయ విద్యార్థులు క్రాంతి, రవితేజ, సంపత్, అనిల్, అలీజ, అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కన్వీనర్‌గా ఆలీ హైదర్‌తో పాటు 36 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

కళాకారులు, ఉద్యమకారుల సమస్యలను పరిష్కరిస్తాం

రాంనగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులు, కళాకారుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మన్ వెన్నెల గద్దర్ పేర్కొన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ అధ్యక్షతన ఆత్మగౌరవ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన వెన్నెల గద్దర్ మాట్లాడుతూ మన హక్కులను సాధించుకునేందుకు ఉద్యమకారులు చేస్తున్న పోరాటానిక సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. గత ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా పోటీ చేశానని, తాను ఓడిపోయినా ప్రజా పాలన గెలిచిందన్నారు. ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి 10 వేల కోట్లు కేటాయించాలని, అర్హులైన ఉద్యమకారులకు 25 వేల పెన్షన్ కల్పించాలని, వెయ్యి మంది అర్హులైన వారికి సాంస్కృతిక సారధిలో ఉద్యోగాలు ఇవ్వాలని అందించాలని, డిమాండ్ చేశారు.